PRGI No. APTEL/2022/81596)

# జనోదయ

JANODAYA

కరీంనగర్ బుధవారం 01.07.2026 : సంపుటి : 03 : సంచిక : 01 పేజీలు : 04 వెల : రూ.5

Karimnagar Wednesday 01.07.2026 : Volume: 03: Issue 01 : Pages 04 : Cost 5/

తెలుగు దినపత్రిక

భారత నూతన ఆర్మీ చీఫ్‌గా

## బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్



**ఢిల్లీ, జూన్ 30 :** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానం లో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ (ట్యాంక్ రెజిమెంట్) విభా గం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమి షన్డ్ అధికారిగా జన రల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జ మ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరో ధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్ మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

## బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్



కేసీఆర్... కాశీ మజిలీ కథలు మానుకో

పిల్లలను కూడా కేసీఆర్ తాగుబోతులను చేశాడు ...కేసీఆర్‌ను రైతులు

పశుపతిని బంధించినట్లు బంధించారు

రైతు భరోసా నిధులు విడుదల

రైతు ఆత్మగౌరవంతో బతికేలా పండుగలా వ్యవసాయం

శిల్పకళా వేదిక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



5లో..

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వచ్చే ప్రభుత్వం మాదే అం టున్నాడు.. ఏంది వచ్చేది.. తెలం గాణలో బీజేపీ ఆటలు సాగవు అని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్‌లో రైతు లకు అందించే రైతు భరోసా ఆర్థిక సాయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి హైదరాబాదులోని శిల్పకళ వేదికగా సీఎం విడుదల చేశారు.

# జులైలో కూడా నిరాశే

## సాధారణం కంటే తక్కువ వర్షపాతమే.. ఐఎండీ అంచనా

- దేశంలో లోటు వర్షపాతం ఉండటంతో వ్యవసాయ రంగంలో అనిశ్చితి
- గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ సాగు 23 శాతం తగ్గినట్లు కేంద్రం అంచనా



వివరాలు ...4లో..

లోటు వర్షపాతం కొనసాగితే ఖరీఫ్ పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది. రైతులు నీటి సంరక్షణతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**నిపుణుల సూచన**

జల సంరక్షణ, పంటల వైవిధ్యం, మట్టి తేమ సంరక్షణపై దృష్టి పెట్టాలి.

దేశంలో ఇప్పటికే వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్‌లో తగినంతగా వర్షాలు కురవలేదు. జూలైలోనైనా భారీ వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్న వారికి షాకిచ్చే ప్రకటన చేసింది భారత వాతావరణ సంస్థ ఐఎండీ. జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ప్రకటించింది. పసిఫిక్ భూమధ్య రేఖ వద్ద ఎల్‌నినో బలపడటం వల్ల ఈ పరిస్థితి ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఇప్పటికే జూన్‌లో 39 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.1901 తర్వాత ఈ స్థాయిలో జూన్‌లో లోటు వం-ర్షపాతం నమోదు కావడం ఇది ఐదోసారి. అంటే 125 ఏళ్లలో ఇంత తక్కువ వర్షపాతం నమోదైన ఐదు జూన్‌లలో ఇదీ ఒకటి.

వికసిత్ భారత్ లక్ష్యంలో

## యువతదే కీలక పాత్ర

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**విశాఖపట్నం, జూన్ 30:** దేశ నిర్మాణంలో విద్యావం తులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశా ఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రా మం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయే ట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీ యువ కులకు పట్టాలు అందిం చడం నాకు ఎం తో సంతోషాన్నిస్తోంది' అని భావో ద్వేగం గా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరో హించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవ కూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడ మే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహిం చడంలో మీ వంతు సహకారం అందించాలి' అని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలక మని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

## హీరో అవ్వాలని చూశాడు

**తిలక్ వర్మపై కృష్ణమాచారి సంచలన వ్యాఖ్యలు**

**స్పోర్ట్స్ డెస్క్:** టీ20 ప్రపంచకప్ 2026ను ముద్దాడిన కొన్ని నెలలకే పసికూన ఐర్లాం డ్ చేతిలో భారత క్రికెట్ జట్టుకు ఊ హించని పరాభవం ఎదురైంది. రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 0–2తో టీమిం డియా కోల్పోయింది. రెండో టీ20లో 155 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనలో భారత్ కేవలం ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. దీంతో టీమిండియాపై మాజీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలానే ఈ ఓటమిపై భారత మాజీ కెప్టెన్, మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్ వేది కగా తీవ్రంగా మండిపడ్డాడు. ముఖ్యంగా తిలక్ వర్మపై సంచలన కామెంట్స్ చేశాడు. భారత బ్యాటర్ల నెమ్మదైన ఆటతీరే ఈ ఓటమికి కారణమని శ్రీకాంత్ విమ ర్శించారు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో తిలక్ వర్మ (46 బంతుల్లో 55), శివం దూబే (16 బంతుల్లో 20), అక్షర్ పటేల్ (18 బంతుల్లో 14) ఆడిన తీరుపై ఆయన నిప్పులు చెరిగాడు. 'మిడిల్ ఓవర్లలో భారత్ ఘోరంగా ఆడింది. వీరి స్ట్రైక్ రేట్లు చాలా పేలవంగా ఉన్నాయి. తిలక్ వర్మ, అక్షర్ పటేల్ కేవలం సింగిల్స్, డబుల్స్ తీస్తూ తమ వ్యక్తిగత స్కోర్ల కోసమే ఆడినట్లు అనిపిం చింది. ఇలాంటి చిన్న లక్ష్యాలను ఒక ఓవర్ మిగిలి ఉండగానే ముగించాలి కానీ, ఆఖరి బంతి వరకు తీసుకెళ్ల కూడదు' అని శ్రీకాంత్ పేర్కొన్నాడు. 'తిలక్ వర్మ మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి తానేదో పెద్ద హీరో అయి పోవాలని చూశాడు.



మ్యాచ్ గెలిపించి జెర్సీ విప్పి సంబరాలు చేసుకోవాల నుకున్నాడేమో!. ఈ స్వార్థ పూరిత ధోరణి వల్లే భారత్ ఓడిపోయింది' అంటూ శ్రీకాంత్ తీవ్రస్థాయిలో విమ ర్శించారు. కొత్త నాయకత్వంలో ప్రయా ణం మొదలుపెట్టిన టీమిండియాకు ఈ ఓటమి పెద్ద గుణపాఠమని క్రీడా విశ్లేష కులు భావిస్తున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు బాధ్యతల స్వీకరణ





**హైదరాబాద్, జూన్ 30 :** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, ఐఏఎస్ మంగళవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాల యంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే రామకృష్ణా రావు (ఐఏఎస్) మంగళవారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సం జయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిసిం దే. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధి పతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతోపాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

# సూరారంలో
# ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

**పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

**జనోదయ, హనుమకొండ జూన్ 30:**

హనుమకొండ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశమైన మంత్రి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా వేగ



వంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామ సర్పంచ్‌తో పాటు స్థానిక ప్రజలతో సమావేశమైన మంత్రి సూరారం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాదరావు ఎంపీఓ రవీందర్ మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మండల సంబంధిత అధికారులతో పాటు సూరారం గ్రామ సర్పంచ్ నీల కొమరయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ పిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ మాజీ యూత్ అధ్యక్షులు హింగే శ్రీకాంత్ డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల ప్రధా



న కార్యదర్శి గుడెల్లి నవీన్ కుమార్ శనగరపు వెంకటేష్ అంబాల స్వామి పులి కృష్ణ సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి పుల్లూరి శ్రీధర్ రావు రవీందర్ గౌడ్ గూటం జోజి రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఈర భీమ్ రాజ్ మండ సుమన్ అంబాల రమేష్ ఠాకూర్ రామ్ సింగ్ బుసరి వినయ్ బొంకూరి క్రాంతి కుమార్ అడ్డూరి అనిల్ నవీన్ ప్రశాంత్ కుడుతాడి రమేష్ అంబీర్ చందర్ సుకినే గోపాల్ రావు సింగిల్ విండో డైరెక్టర్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా
# సర్‌ని నిర్వహించాలి

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో సర్ ఇంచార్జ్‌లతో సమీక్ష**



**జనోదయ, రామగుండం,జూన్ 30.**

భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి చేరుకుని సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు, ఇంచార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన పత్రాల సేకరణలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో, గ్రామాల్లో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజన్, గ్రామాల ఇంచార్జ్‌లు తమ పరిధిలో జరుగుతున్న సర్ కార్యక్రమం పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పోరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల గుప్పిట్లో
# రూ.50 కోట్ల సీఎంసీ (జీహెచ్ఎంసీ) భూమి ?

**-మహిళా భవనం స్థలాన్ని కాపాడండి..**
**లేదంటే మహిళలతో కలిసి న్యాయపోరాటం**
**చేస్తాం : మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి**

**జనోదయ : శేరిలింగంపల్లి :** చందానగర్ డివిజన్ పరిధిలో మహిళల సంక్షేమం కోసం కేటాయించిన సుమారు రూ. 50 కోట్ల విలువైన సీఎంసీ (జీహెచ్ఎంసీ) భూమి కబ్జాదారుల పాలవుతుండగా, మున్సిపల్ అధికారులు మాత్రం మొద్దునిద్ర వీడడం లేదని మాజీ కార్పొరేటర్, న్యాయవాది బొబ్బ నవతారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల అండతో కొందరు కబ్జాదారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత రెండు సంవత్సరాలుగా పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ కైలాష్‌నగర్ కాలనీలోని సర్వే నంబర్ 210లో సుమారు 4 వేల గజాల స్థలం ఉందని, దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 50 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ స్థలంలో మహిళా భవనం, మోడల్ మార్కెట్, ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2018 మార్చి 7న, 2019 మే 5న (లెటర్ నెంబర్ ఎల్ సి1/3076/2016) ప్రొసీడింగ్స్ ద్వారా అప్పటి మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించారని వివరించారు. దీనికి అనుగుణంగా 2019లో కార్పొరేషన్ అధికారులు ప్రహరీ గోడ, గేటు నిర్మించినప్పటికీ, 2022 ఆగస్టు 10న, 2024 ఫిబ్రవరి 9న కబ్జాదారులు వాటిని ధ్వంసం చేసి స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ వ్యవహారంపై ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా, “ఆ స్థలం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందింది కాదని, ప్రభుత్వ భూమి” అంటూ తప్పుదోవ పట్టించే సమాధానం ఇచ్చారని తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రొసీడింగ్స్ ప్రతులను జతచేసి 2024లో, మళ్లీ 2025 నవంబర్‌లో కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాలేదని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని అదే స్థలంలో టీజీఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారని, విద్యుత్ శాఖను ఆర్టీఐ ద్వారా ప్రశ్నించగా సంబంధిత భూమికి ఎలాంటి అధికారిక కేటాయింపు పత్రాలు లేవని, ప్రజాప్రతినిధుల సూచన మేరకే నిర్మాణం చేపట్టామని సమాధానం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ అంశంపై టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నించగా హెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 635 ప్రకారం నోటీసులు జారీ చేశామని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకున్నారని ఆమె విమర్శించారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా కేవలం నోటీసులతో సరిపెట్ట





డం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ప్రకారం వెంటనే భూమిని స్వాధీనం చేసుకుని మహిళా భవనం, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బొబ్బ నవతారెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమంతో పాటు న్యాయపోరాటం చేపడతామని హెచ్చరించారు.

## డీబీఎఫ్ జిల్లా మహాసభలను
# విజయవంతం చేయండి

**- చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు**



**జనోదయ, హనుమకొండ, జూన్ 30:** జూలై 06 న హనుమకొండ హరిత కాకతీయ హోటల్ లో నిర్వహించే దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్ ) వరంగల్ ఉమ్మడి జిల్లా 11వ మహాసభలను విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ దళిత బహుజన ఉద్యమ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో డిబిఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించి, జిల్లా 11వ మహాసభల బ్రోచర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ డిబిఎఫ్ గత 20 సంవత్సరాలుగా దళిత,గిరిజన పేద కుటుంబాల సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కార మార్గాలకై భారత రాజ్యాంగ వెలుగులో బాధితులతో కలిసి ఉద్యమిస్తూ పరిష్కారం దిశగా పయనిస్తుందన్నారు. భూమి, ఉపాధి హామీ కూలీల హక్కులకై నినదిస్తూ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న ప్రభుత్వాలను ప్రశ్నిస్తుందన్నారు. రాష్ట్రంలో విబి జీ గ్రామ్ జీ చట్టాన్ని అమలు చేయకుండా రాష్ట్రంలో నూతన ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ అలోచన విధానంతో ప్రతి యువత అవినితిపై ఉద్యమిస్తూ,ఓటు హక్కును సద్వినియోగం చేసుకొవాలన్నారు. జూలై 6న హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో డిబిఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా 11వ మహాసభలకు యువతి,యువకులు,విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు,అంబేద్కర్ వాధులు,దళిత బహుజన ఉద్యమ నాయకులు,కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల కర్ణాకర్,కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డిబిఎఫ్ దామెర మండల అధ్యక్షులు బాగాది కుమార్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు తోట శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దండు విజేందర్,దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కిషన్,దండు బాస్కర్, రాజు,బిక్షపతి,యాదగిరి,వీరస్వామి, బాబు,చిన్న,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏనుమాముల ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**-నూతన ఎస్సై వడిచర్ల గోవర్ధన్‌కు**
**శాలువా కప్పి సన్మానం**

**జనోదయ : వరంగల్ : జూన్ 30**

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వడిచర్ల గోవర్ధన్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, రాష్ట్ర నాయకులు అడుప మహేష్, ఎండి జానీ ఆధ్వర్యంలో సుమారు 100 మంది కార్యకర్తలతో కలిసి ఎస్సైని ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వడిచర్ల గోవర్ధన్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణే తమ ధ్యేయమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీస్ శాఖకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ గ్రామ అధ్యక్షుడు కడెం కుమార్, సుందరయ్య నగర్ శాఖ అధ్యక్షుడు త్రికోవెల



శీను, ఎన్టీఆర్ నగర్ గ్రామ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి జోన్‌లో
# డ్రైనేజీ వ్యవస్థ మరింత బలోపేతం

**జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్**
**-వరద ముంపు నివారణకు తక్షణ, దీర్ఘకాలిక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశం**




**జనోదయ : శేరిలింగంపల్లి జూన్ 30 :** శేరిలింగంపల్లి జోన్‌లో డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కన్సల్టెంట్ ఎన్ సిపి ప్రతినిధులతో కలిసి జోన్ పరిధిలోని డ్రైనేజీ ప్యాటర్న్, ఫ్లో హైడ్రాలిక్స్‌పై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జోన్‌లోని ప్రధాన, అనుబంధ నాలాల ప్రస్తుత పరిస్థితి, నీటి ప్రవాహ సామర్థ్యంపై ఎన్ సిపిఈ సమర్పించిన సాంకేతిక నివేదికను పరిశీలిం చారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముం దస్తు చర్యలు, డ్రైన్ల కెపాసిటీ పెంపు, వాటర్ ఫ్లో మెరుగుదల, అవరోధాల తొలగింపుతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ల అభివృద్ధి, మిస్సింగ్ లింక్‌ల పూర్తి కోసం డిపిఆర్ తయారీని వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి జోన్‌లో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఎన్ సిపిఈ నివేదిక ఆధారంగా తక్షణ, దీర్ఘకాలిక పనులను గుర్తించి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సిఈ శ్రీలక్ష్మి, ఎస్ఈ శంకర్, నమ్య ఈఈలు, ఏసిపిలు, డిప్యూటీ ఈఈ లు, ఎన్ సిపిఈ టెక్నికల్ టీమ్, తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో
# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఘన వీడ్కోలు

**-సీపీ డాక్టర్ ఎం.రమేష్ చేతుల మీదుగా సత్కారం..పెన్షన్ పత్రాలు, జ్ఞాపికలు అందజేత**

**జనోదయ : శేరిలింగంపల్లి జూన్ 30 :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆడిటోరియంలో పదవీ విరమణ పొందిన 14 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సెల్‌కు చెందిన ఎస్ఐ జాకీర్ హుస్సేన్, సీటీసీ ఎస్ఐ వెంకట్ రెడ్డి, షాబాద్ ఎస్ఐ శంకర్ రెడ్డి, సనత్‌నగర్ ఎస్ఐ నాగరాజులు, పీసీఆర్ ఎస్ఐ షేక్ షబుద్దీన్, రామచంద్రాపురం ఎస్ఐ నారాయణ గౌ డ్, షీ టీమ్స్ ఎస్ఐ శ్రీనివాస్, ఆమనగల్ ఎస్ఐ సీతారాం రెడ్డి, ఆమ నగల్ ఏఎస్ఐ ఎస్.మురళీధర్, మియా పూర్ ఏఎస్ఐ మాణిక్ రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ఎస్ఐ సుబ్బరాయుడు, ఏఆర్ఎస్ఐ మాణిక్ రెడ్డి, పీసీఆర్ సైబరా బాద్‌కు చెందిన పీసీ ఎ.లక్ష్మణ్ నాయక్, నార్సింగి పోలీస్ స్టేషన్ హెచ్.జి. ఎం. నగేష్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిష నర్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖకు సుదీర్ఘకాలం అంకిత భావంతో సేవలందించిన ప్రతి అధికారి, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని అన్నా రు. కుటుంబం కంటే విధులకు ప్రాధా న్యం ఇస్తూ ప్రజల భద్రత కోసం అహర్ని శలు శ్రమించిన వారి సేవలను కొనియాడారు. పోలీసు కుటుంబ సభ్యుల సహకారం కూడా



అభినందనీయమని పేర్కొంటూ, పదవీ విరమణ పొందిన వారు ఆరోగ్యంగా, ఆనందంగా విశ్రాంతి జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అలాగే తమ అనుభవాలను పోలీస్ శాఖ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని సత్కరించి జ్ఞాపి కలు, పెన్షన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి.అన్న పూర్ణ, ఎస్బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వా ర్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీ లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన సహచరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆశల పల్లకీ... సవాళ్ల ముళ్లు!



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

## రేవంత్ మార్క్ రెండేళ్లు

2023 డిసెంబరు 7 తెలంగాణ రాజకీయ యవనికపై ఒక నూతన అధ్యాయం లిఖించబడిన రోజు. పదేళ్ల బీఆర్ఎస్ ఏకఛత్రాధిపత్యానికి తెరదించుతూ, 119 స్థానాలకు గాను 64 సీట్ల స్పష్టమైన మెజారిటీతో కాంగ్రెస్ పీఠాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకు కాలం గరగరగా తిరిగేసింది. తాజాగా ఆయన తన రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్నారు. అధికారం చేపట్టిన తొలిరోజు నుంచే సంచలన నిర్ణయాలతో వార్తల్లో నిలిచిన రేవంత్ సర్కార్ రెండేళ్ల ప్రస్థానం ఇప్పుడు సర్వత్రా ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ ఖజానాలో వెలుగులు, ప్రతిపక్షాల విమర్శల సెగలు, సామాన్యుడి ఆశలు, నిరాశల నడుమ సాగిన ఈ 24 నెలల ప్రయాణాన్ని ఒకసారి నిశితంగా, మేగజైన్ శైలిలో విశ్లేషిస్తే ఎన్నో ఆసక్తికరమైన కోణాలు సాక్షాత్కరిస్తాయి.

### ఆరు గ్యారెంటీలు : ఆశల పల్లకి... వాస్తవాల ముళ్లు

ఒక ప్రభుత్వ చిత్తశుద్ధిని కొలవడానికి వారు ఇచ్చిన ఎన్నికల హామీలే పెద్ద కొలబద్దలు. రేవంత్ రెడ్డి పగ్గాలు చేపట్టిన కేవలం 24 గంటల్లోనే మహాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించారు. ఇది క్షేత్రస్థాయిలో మహిళా లోకానికి కొండంత అండగా నిలిచింది. ఆ వెను వెంటనే గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అంకురార్పణ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం వంటి చర్యలు శరవేగంగా జరిగాయి. వీటన్నింటికీ మించి, రైతు సంక్షేమమే ధ్యేయంగా కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.18,000 కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లోకి జమ చేసి, రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీని అమలు చేయడం ఒక సాహసోపేతమైన అడుగుగా రికార్డులకు ఎక్కింది. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల భద్రత కోసం రూ.1.20 కోట్ల ఉచిత జీవిత బీమా పథకాన్ని ప్రకటించి మరో మైలురాయిని దాటారు. కానీ, నాణేనికి మరోవైపు ఉన్నట్లు , ఆరు గ్యారెంటీలలోని కొన్ని కీలక వాగ్దానాలు ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయాయి. నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇంకా స్పష్టత రాలేదు. రూ.500 కే గ్యాస్ సిలిండర్ పథకం పూర్తి స్థాయిలో ప్రతి ఒక్కరికీ అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటన్నింటికీ మించి, దాదాపు రూ.10,000 కోట్లకు పైగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కలలపై నీళ్లు చల్లుతున్నాయని, విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెడుతున్నాయని ప్రతిపక్షాలు గళమెత్తుతున్నాయి.

### ఆర్థిక పరిస్థితి : అప్పుల ఊబిలో ఆనంద హేల?

ప్రస్తుతం తెలంగాణను వేధిస్తున్న అతి పెద్ద సమస్య ఆర్థిక మందగమనం. ఒకవైపు సంక్షేమ పథకాలకు నిధుల వరద పారించాల్సి రావడం, మరోవైపు విశ్వనగరం హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఊహించని విధంగా చల్లబడటం రేవంత్ సర్కార్‌కు కత్తిమీద సాములా మారింది. ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో, సంక్షేమ రథాన్ని ముందుకు నడపడానికి అప్పుల కోసం ఆర్బీఐ వైపు చూడక తప్పడం లేదు. ఈ విషయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే దాదాపు రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిందని బీఆర్ఎస్ గులాబీ దళం ఆరోపిస్తుంటే, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల పేరిట జరిగిన అవకతవకలు, పేరుకుపోయిన గుట్టలంత అప్పులను తీర్చడానికే తాము ప్రాధాన్యత ఇస్తున్నామని, తమ ఖర్చంతా ప్రజా సంక్షేమం కోసమేనని హస్తం నేతలు గట్టిగా సమర్థించుకుంటున్నారు. అయితే, ఈ అప్పుల భారం భవిష్యత్తు తెలంగాణ బడ్జెట్‌లపై ఎంతటి శాపంగా మారబోతోందో ఆర్బీఐ, కాగ్ నివేదికలు వస్తే కానీ పూర్తి వాస్తవాలు బయటపడవు.

### గ్లోబల్ సిటీ హైదరాబాద్: మెరుపులు... మరమ్మతులు:

గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోయిన హైదరాబాద్ నగరం, ప్రస్తుతం కొన్ని మౌలిక వసతుల లేమితో సతమతమవుతోందనేది కాదనలేని నిజం. నగరంలో అప్రకటిత కరెంటు కోతలు, తాగునీటి ఎద్దడి, రోడ్ల తవ్వకాలు మధ్యలోనే నిలిచిపోవడం వంటి అంశాలపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. నిధుల కొరత వల్లే ఈ పనులు ఆలస్యమవుతున్నాయనే విషయాన్ని ప్రభుత్వ వర్గాలు అంతర్గతంగా అంగీకరిస్తున్నాయి. అయినప్పటికీ, రేవంత్ రెడ్డి మార్క్ అభివృద్ధి ప్రణాళికలు నగర భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డు రవాణా రంగాన్ని సరికొత్త మలుపు తిప్పే ప్రాజెక్టు. మెట్రో రెండో దశ నగర శివార్లను అనుసంధానించే విస్తరణ పనులు. మూసీ నది ప్రక్షాళన లండన్ థేమ్స్ నది తరహాలో మూసీని మార్చే ప్రతిష్టాత్మక సంకల్పం. ఫ్యూచర్ సిటీ అండ్ కారిడార్లుగా ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాలకు ఔటర్ రింగ్ రోడ్లు, మెగా గ్రోత్ కారిడార్ల నిర్మాణం ద్వారా అభివృద్ధిని వికేంద్రీకరించే వ్యూహం.

### దార్శనికత : తెలంగాణ రైజింగ్-2047:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఐదేళ్ల పాలనపైనే కాకుండా, సుదూర భవిష్యత్తుపై కన్నేశారు. అందులో భాగమే "తెలంగాణ రైజింగ్-2047" విజన్ డాక్యుమెంట్. 2034 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే దీని పరమావధి. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), ఫార్మా, ఏరోస్పేస్, టూరిజం, ఎంఎస్ఎంఈ రంగాలను ప్రధాన వృద్ధి చోదకాలుగా ఎంచుకున్నారు. ఈ దార్శనికతలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మరో విప్లవాత్మక చర్య సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి సర్వే (కుల గణన). సుమారు 3.55 కోట్ల మంది, 242 కులాల వివరాలను సేకరించడం ద్వారా సంక్షేమ పథకాలను నిజమైన అర్హులకు చేర్చవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇది భవిష్యత్తు సామాజిక న్యాయానికి పునాది అని కాంగ్రెస్ అంటుంటే, ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ప్రతిపక్షాలు కొట్టిపారేస్తున్నాయి.

> **రెండేళ్ల రేవంత్ రెడ్డి పాలనను బేరీజు వేస్తే, అది ఒక మిశ్రమ అనుభూతుల సమాహారం. ఆరు గ్యారెంటీల లోని ప్రధా న హామీలను వేగంగా అమలు చేయడం, భవిష్యత్తు అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ వంటి ప్రణాళికలు వేయడం సానుకూల అంశాలైతే పెరుగుతున్న అప్పుల భారం, హైదరాబాద్ మౌలిక వసతుల వైఫల్యాలు, బకాయిల నిర్వహణలో జాప్యం సవాళ్లుగా నిలిచాయి.**

### రాజకీయ చదరంగం: స్థిరత్వమా? ఆపరేషన్ ఆకర్షా?

రాజకీయంగా రేవంత్ రెడ్డి తనదైన వ్యూహాలతో దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ వైపు తిప్పుకోవడంలో ఆయన చూపిన చొరవ పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తోంది. దీనిపై ఆపరేషన్ ఆకర్ష్ అంటూ పౌర సమాజం, ప్రతిపక్షాలు నైతికత విలువలను ప్రశ్నిస్తూ విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం, తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన క్లీన్ చిట్ అని అధికార పక్షం సంబరపడుతోంది. దీనికి విరుద్ధంగా, క్షేత్రస్థాయిలో పాలన దారుణంగా పడిపోయిందని, అవినీతి కట్టడిలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందని కె.చంద్రశేఖర్‌రావు, కేటీఆర్ వంటి గులాబీ అధినేతలు నిత్యం ధ్వజమెత్తుతున్నారు.



### ముగింపు రేఖ:

రెండేళ్ల రేవంత్ రెడ్డి పాలనను బేరీజు వేస్తే, అది ఒక మిశ్రమ అనుభూతుల సమాహారం. ఆరు గ్యారెంటీలలోని ప్రధాన హామీలను వేగంగా అమలు చేయడం, భవిష్యత్తు అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ వంటి ప్రణాళికలు వేయడం సానుకూల అంశాలైతే పెరుగుతున్న అప్పుల భారం, హైదరాబాద్ మౌలిక వసతుల వైఫల్యాలు, బకాయిల నిర్వహణలో జాప్యం సవాళ్లుగా నిలిచాయి. మిగిలిన మూడేళ్ల కాలంలో ఈ ఆర్థిక లోటును అధిగమించి, సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని రేవంత్ రెడ్డి తెలంగాణను ఎలా ముందుకు నడిపిస్తారనేదే వచ్చే ఎన్నికల భవిష్యత్తును, తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని శాసించనుంది. దార్శనికతకు, ఆచరణకు మధ్య ఉన్న దూరాన్ని రేవంత్ సర్కార్ ఎంతవరకు పూడుస్తుందో వేచి చూడాలి!

---

## రూ. 7 కోట్ల బడ్జెట్..
## రూ. 1700 కోట్ల వసూళ్లు

### ఓటీటీలోకి వచ్చేసిన హాలీవుడ్ హారర్ సెన్సేషన్ 'అబ్సెషన్'!



బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడానికి వందల కోట్ల బడ్జెట్, భారీ గ్రాఫిక్స్ అవసరం లేదని, కేవలం బలమైన కంటెంట్ ఉంటే చాలని నిరూపించింది హాలీవుడ్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ చిత్రం 'అబ్సెషన్' (ాఎంవంంఅశీఅ). ప్రముఖ యూట్యూబర్ కర్రీ బార్కర్ దర్శకత్వంలో కేవలం రూ. 7 కోట్ల రూపాయల అత్యల్ప బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 1700 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించింది. హారర్ హిస్టరీలోనే మోస్ట్ ప్రాఫిటబుల్ మూవీస్‌లో ఒకటిగా నిలిచిన ఈ గ్లోబల్ బ్లాక్ బస్టర్, ఇప్పుడు డిజిటల్ ప్రియులను అలరించేందుకు ఓటీటీ వేదికగా అందుబాటులోకి వచ్చేసింది. జూన్ 30 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో, యాపిల్ టీవీ , పీకాక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్‌లలో ఈ చిత్రం ప్రీమియం వీడియో ఆన్ డిమాండ్ (రెంటల్) విధానంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథాంశం విషయానికి వస్తే.. 'బేర్' అనే ఒక సాధారణ యువకుడు తను ప్రాణంగా ప్రేమించే 'నిక్కీ' మనసును గెలుచుకోవడానికి ఒక అతీంద్రియ శక్తి కలిగిన 'వన్ విష్ విల్లో' (మ్యాజిక్ స్టిక్)ను విరగ్గొట్టి ఒక కోరిక కోరతాడు. ఈ ప్రపంచంలో అందరికంటే ఎక్కువగా నిక్కీ తన్నే ప్రేమించాలని అతడు కోరుకుంటాడు. ఆ మ్యాజిక్ స్టిక్ ప్రభావంతో నిక్కీ నిజంగానే బేర్‌తో విపరీతమైన ప్రేమలో పడిపోతుంది. మొదట్లో అంతా సంతోషంగానే సాగినా, రోజులు గడిచే కొద్దీ ఆమె ప్రేమ కాస్త 'అబ్సెషన్' (ఒక రకమైన పిచ్చి)గా మారుతుంది. బేర్ అనుక్షణం తన పక్కనే ఉండాలని పట్టుబట్టడం, అతడు వేరే వాళ్లతో మాట్లాడితే తట్టుకోలేకపోవడం, చివరికి అతని కోసం ఏ స్థాయి దారుణాలకైనా, హత్యలకైనా తెగించే సైకోలా నిక్కీ ఎలా మారింది అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సైకలాజికల్ థ్రిల్లర్ సాగుతుంది. ఈ చిత్రం భారతదేశంలోనూ ఊహించని స్థాయిలో వసూళ్ల వర్షం కురిపించింది. కేవలం మౌత్ టాక్‌తో మన దేశంలోనే దాదాపు 90 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. థియేటర్లలో ప్రేక్షకులను వెన్నులో వణుకు పుట్టించిన ఈ విలక్షణ హారర్ డ్రామా, ప్రస్తుతానికి ఓటీటీలలో అన్‌కట్ వెర్షన్‌తో కేవలం ఇంగ్లీష్ భాషలోనే అందుబాటులోకి రానుంది. అయితే త్వరలోనే తెలుగుతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లో కూడా ఈ చిత్రాన్ని డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. థియేటర్లలో ఈ హారర్ సెన్సేషన్‌ను మిస్ అయిన వారు ఇప్పుడు హ్యాపీగా ఇంట్లోనే కూర్చుని డిజిటల్ స్క్రీన్స్ పై దీనిని వీక్షించవచ్చు.

---

# విశ్వాసానికి గాయం



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

అయోధ్య రామమందిరం కేవలం ఒక ఆలయం కాదు. కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక విశ్వాసానికి, దశాబ్దాల ఉద్యమానికి, సాంస్కృతిక భావోద్వేగానికి ప్రతీక. అలాంటి పవిత్ర స్థలంలో భక్తులు సమర్పించిన హుండీ నగదు, బంగారం, వెండి, ఆభరణాల దుర్వినియోగం లేదా దొంగతనం జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఇది కేవలం ఒక క్రిమినల్ కేసు కాదు; ప్రజల విశ్వాసం, మత సంస్థల పారదర్శకత, అధికార వ్యవస్థల జవాబుదారీతనంపై నిలిచిన ప్రశ్న. ఇటీవల నమోదైన కేసుల ప్రకారం, ఆలయ విరాళాల నిర్వహణలో భాగమైన ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు వార్తలు వెల్లడించాయి. కొంత నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దర్యాప్తులో నగదు లెక్కింపు విధానాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ఉద్యోగుల నియామకాలు, హుండీల భద్రత వంటి అంశాల్లో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయని పలు జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. అయితే ప్రజల్లో ఎక్కువ చర్చకు దారి తీసింది దొంగతనం ఆరోపణల కంటే దర్యాప్తు దిశ. అత్యంత భద్రతా వలయంలో ఉండే రామమందిరంలో, వందలాది సీసీటీవీ కెమెరాలు, కఠిన నియంత్రణలు, బహుళస్థాయి పర్యవేక్షణ వ్యవస్థలు ఉన్నప్పుడు కేవలం కొంతమంది ఉద్యోగులు లేదా నగదు లెక్కించే సిబ్బంది మాత్రమే ఈ స్థాయి అవకతవకలకు పాల్పడగలరా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ఉన్నత స్థాయి వ్యక్తులపై అభియోగాలు రుజువు కాలేదు. కానీ ప్రజల్లో అనుమానాలు మాత్రం కొనసాగుతున్నాయి. అవి నిజమా కాదా అన్నది కోర్టులు, దర్యాప్తు సంస్థలే తేల్చాలి. కానీ ఈ అనుమానాలు ఎందుకు ఉద్భవిస్తున్నాయో కూడా అర్థం చేసుకోవాలి. దర్యాప్తులో కొందరు ట్రస్ట్ సభ్యులు, ముఖ్య బాధ్యతలలో ఉన్న వ్యక్తులు రాజీనామా చేసినట్లు వార్తలు వచ్చాయి. ట్రస్ట్ స్వయంగా "నిష్పక్షపాత దర్యాప్తుకు సహకరిస్తాం" అని ప్రకటించింది. ఈ పరిణామాలు వ్యవహారం సాధారణ పరిపాలనా లోపం కాదనే సంకేతాన్ని ఇస్తున్నాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఆరోపణలు, అనుమానాలు, రాజకీయ వ్యాఖ్యలు ఒకటి; నిరూపితమైన వాస్తవాలు మరొకటి. ప్రతిపక్ష నాయకులు ఈ అంశాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొందరు దీనిని హిందూ సమాజానికి జరిగిన మోసంగా అభివర్ణిస్తుండగా, మరికొందరు ప్రభుత్వ పర్యవేక్షణ వైఫల్యంగా చిత్రీకరిస్తున్నారు. కానీ రాజకీయ విమర్శలతోనే సత్యం తేలిపోదు. అదే సమయంలో అధికారిక ప్రకటనలతోనే ప్రజల అనుమానాలు కూడా తొలగిపోవు. దేశీయ, అంతర్జాతీయ మీడియా ఈ వ్యవహారాన్ని కేవలం దొంగతనం కేసుగా కాకుండా "పారదర్శకత సంక్షోభం"గా చూస్తోంది. ఎందుకంటే అయోధ్య రామమందిరం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మతపరమైన ప్రాజెక్టు. కోట్లాది రూపాయల విరాళాలు ప్రతిరోజూ వస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై అత్యున్నత ప్రమాణాల పారదర్శకత అవసరం. విరాళాల లెక్కింపు, బ్యాంకులకు బదిలీ, ఆభరణాల రికార్డింగ్, ఆడిట్ వ్యవస్థలు అన్నీ ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉండాలి. సోషల్ మీడియా, రెడ్డిట్ వంటి వేదికలలో అయితే మరింత తీవ్రమైన ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇది కేవలం దిగువస్థాయి ఉద్యోగుల పని కాదని, మరింత విస్తృతమైన బాధ్యతా వైఫల్యం ఉండవచ్చని వాదిస్తున్నారు. మరికొందరు దర్యాప్తు పూర్తి కాకముందే పెద్ద ఎత్తున రాజకీయ నిర్ధారణలకు వస్తున్నారు. అయితే సోషల్ మీడియా వ్యాఖ్యలను నిర్ధారిత సాక్ష్యాలుగా పరిగణించలేమని గుర్తుంచుకోవాలి. అవి ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించవచ్చుగానీ, న్యాయపరమైన సత్యాన్ని కాదు.



ఈ సంఘటన మరో పెద్ద ప్రశ్నను లేవనెత్తుతోంది. భారతదేశంలోని దేవాలయాలు, మఠాలు, చర్చిలు, మసీదులు, గురుద్వారాలు వంటి మత సంస్థల ఆర్థిక నిర్వహణ ఎంత పారదర్శకంగా ఉంది? భక్తుల విరాళాలు ఎలా వినియోగించబడుతున్నాయి? వార్షిక ఆడిట్ నివేదికలు ఎంతవరకు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి? మతం పేరుతో నడిచే సంస్థలు ప్రజా విశ్వాసాన్ని పొందుతున్నప్పుడు, వాటి జవాబుదారీతనం కూడా అంతే స్థాయిలో ఉండాలి. రామమందిరం వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థ విషయంలో ఈ ప్రమాణాలు మరింత కఠినంగా ఉండాలి. ఎందుకంటే ఇది కేవలం ఒక మత సంస్థ మాత్రమే కాదు; దేశ రాజకీయాలు, సంస్కృతి, చరిత్ర, సామాజిక భావోద్వేగాలతో ముడిపడి ఉన్న చిహ్నం. అందువల్ల చిన్న లోపం కూడా పెద్ద సంక్షోభంగా మారుతుంది. ఈ వివాదంలో అత్యంత బాధాకరమైన అంశం ఏమిటంటే, భక్తులు సమర్పించిన ప్రతి రూపాయి వెనుక ఒక విశ్వాసం ఉంటుంది. కొందరు తమ సంపాదనలో భాగం ఇస్తారు. కొందరు జీవితకాల పొదుపులను సమర్పిస్తారు. మరికొందరు భక్తి భావంతో బంగారం, వెండి, ఆభరణాలు అందిస్తారు. అలాంటి విరాళాల నిర్వహణలో అవకతవకల ఆరోపణలు రావడం ఆర్థిక నష్టానికి మించిన నైతిక నష్టం. కాబట్టి ఈ వ్యవహారంలో అసలు అవసరం రాజకీయ ఆరోపణలు కాదు, సంపూర్ణ సత్యావిష్కరణ. అరెస్టయిన వ్యక్తులు మాత్రమే బాధ్యులా? లేక పర్యవేక్షణలో ఉన్నతస్థాయి వైఫల్యాలు కూడా ఉన్నాయా? భద్రతా వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? సీసీటీవీ పర్యవేక్షణలో లోపాలు ఎలా వచ్చాయి? బాధ్యత ఎక్కడ ఆగుతుంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. రాముడి పేరు మీద నిర్మితమైన ఆలయంలో జరిగిన ఈ వివాదం చివరకు ఒకే సందేశాన్ని ఇస్తోంది. విశ్వాసం సంపాదించడం కష్టం; కోల్పోవడం చాలా సులభం. భక్తుల విశ్వాసాన్ని కాపాడాలంటే న్యాయం జరిగిందని చెప్పడం సరిపోదు. న్యాయం జరిగిందని ప్రజలకు అనిపించాలి. అదే అయోధ్యకు, అదే రామమందిరానికి, అదే భారత ప్రజాస్వామ్యానికి ఇప్పుడు ఉన్న అతిపెద్ద పరీక్ష.

# ఒకే పాఠశాలలో 16 ఏళ్ల సేవ

**ఘనంగా సత్కరించిన గ్రామం**

**పదవీ విరమణ పొందిన**

**జన్ను దమరికి అపూర్వ సన్మానం**

**అంకితభావానికి ప్రశంసల జల్లు**

**గీసుకొండ, జూన్ 30 జనోదయ:**

గొర్రెకుంట జడ్పీహెచ్ఎస్‌లో వరుసగా 16 సంవత్సరాలు నిరంతరాయంగా సేవలందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయిని జన్ను దమరికి గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఘన సన్మానం నిర్వహించి సేవలకు కృతజ్ఞతాభివందనం తెలిపారు. ఒకే పాఠశాలలో సుదీర్ఘకాలం అంకితభావంతో విధులు నిర్వర్తించి ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆమె సేవలను పలువురు వక్తలు కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మొగిలిచర్ల జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పోలెపాక అనిత విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు, ఒకే పాఠశాలలో వరుసగా 16 సంవత్సరాలు సేవలందించడం అరుదైన ఘనత అని పేర్కొన్నారు. విద్యను బోధించడమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, విలువలను పెంపొందిస్తూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో జన్ను దమరి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆమె బోధనలో తీర్చిదిద్దుకున్న విద్యార్థులు నేడు ఇంజనీర్లు, వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో రాణించడం ఆమె ఉపాధ్యాయ జీవిత సార్థకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగ ధర్మాన్ని ఆదర్శంగా నిలబెట్టి తరాల భవిష్యత్తుకు బలమైన పునాది వేసిన ఉపాధ్యాయినిగా ఆమె చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు.



గొర్రెకుంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలెపాక సుమన్ మాట్లాడుతూ, ఒకే పాఠశాలలో 16 సంవత్సరాలపాటు సేవలందించడం విశేషమని, విద్యార్థులను క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో దమరి చేసిన సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల క్లేమెంట్, డీఎస్పీ బాధ్యులు చిలువేరు రవి, గొర్రెకుంట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లెదల్ల సంపత్, పాఠశాల అమ్మ కమిటీ అధ్యక్షురాలు కోకిల పద్మ, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని జన్ను దమరికి ఘన సన్మానం చేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**-అధిక ఫీజుల వసూళ్లపై డిఈఓ రంగయ్య నాయుడుకు వినతిపత్రం**

**జనోదయ : వరంగల్ : జూన్ 30**

వరంగల్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని స్వేరోస్, ఏబీఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు శనిగరపు రాజేంద్ర ప్రసాద్, బొట్ల నరేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు కనీస సౌకర్యాలు లేకపోయినా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ కోర్సుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులపై అనవసర విద్యా భారం మోపుతున్నారని మండిపడ్డారు. విద్యా హక్కు చట్టంను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, డిఈఓ జారీ చేసిన ఆదేశాల మేరకు పాత్రికేయుల పిల్లలకు 50% ఫీజు రాయితీ, పేద విద్యార్థులకు 25% సీట్లు కేటాయించే



నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, ప్రమోద్, శ్రీకాంత్, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 5,జూలై రోజున కరీంనగర్ కళాభారతిలో సిత్రం సినిమా ప్రివ్యూ షో

**జనోదయ : స్టేట్ కల్చరల్ బ్యూరో**

బి.వి.ఎస్ సినిమాస్, చోట టాకీస్‌పై బన్ని వర్మ, లహరి హీరో,హీరోయిన్ లుగా, బన్ని వర్మ నిర్మాణంలో ఏ.కే.ఆర్ దర్శకుడిగా తెరకెక్కించిన చిత్రం సిత్రం ఈ సినిమాకు డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా మల్లి వర్మ , ఎడిటర్‌గా శంకర్ కాక హరిదర్శన్‌లు చేయగాఏ.కే.ఆర్. వీణ, దాక్షాయిణి ముఖ్య పాత్రలలో నటించారు.సిత్రం సినిమాను జూలై 5 తేదీ ఆదివారం రోజున కరీంనగర్ కళాభారతిలో మధ్యాహ్నం 2 గంటలకు సిత్రం సినిమా ప్రత్యేకంగా ప్రివ్యూ షో ప్రదర్శన వేయడం జరుగుతుందని నటుడు , నిర్మాత బన్నీ వర్మ తెలిపారు.ఈ సినిమాను పల్లెటూరి వాతావరణంలో నిర్మించడం జరిగింది , సినిమా ప్రివ్యూను ప్రతి జిల్లాలో ప్రదర్శన చేస్తామని సినిమాల అభిమానులు,యూట్యూబర్స్ విచ్చేసి సినిమాను చూసిఆదరిస్తారని ఆశిస్తున్నాను అని డైరెక్టర్ ఏ.కే.ఆర్ జనోదయ తెలుగు దినపత్రిక “ ద్వారా ప్రత్యేకంగా తెలిపారు




# జులైలో కూడా నిరాశే

**సాధారణం కంటే తక్కువ వర్షపాతమే.. ఐఎండీ అంచనా**

**దేశంలో లోటు వర్షపాతం ఉండటంతో వ్యవసాయ రంగంలో అనిశ్చితి**

**గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ సాగు 23 శాతం తగ్గినట్లు కేంద్రం అంచనా**

**న్యూఢిల్లీ:** దేశంలో ఇప్పటికే వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్‌లో తగినంతగా వర్షాలు కురవలేదు. జూలైలోనైనా భారీ వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్న వారికి షాకిచ్చే ప్రకటన చేసింది భారత వాతావరణ సంస్థ ఐఎండీ. జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ప్రకటించింది. పసిఫిక్ భూమధ్య రేఖ వద్ద ఎల్‌నినో బలపడటం వల్ల ఈ పరిస్థితి ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఇప్పటికే జూన్‌లో 39 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. 1901 తర్వాత ఈ స్థాయిలో జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కావడం ఇది ఐదో సారి. అంటే 125 ఏళ్లలో ఇంత తక్కువ వర్షపాతం నమోదైన ఐదు జూన్‌లలో ఇదీ ఒకటి. ఐఎండీ తాజా అంచనా ప్రకారం జూలైలో దేశంలోని అనేక ప్రాంతాల్లో తక్కువ వర్షపాతమే నమోదవుతుంది. సెంట్రల్ ఇండియా, ఉత్తర భారత, తూర్పు భారత్ ప్రాంతాల్లో లోటు వర్షపాతమే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం భారీ వర్షపాతమే నమోదయ్యే ఛాన్స్ ఉంది. వాయువ్య, తూర్పు-మధ్య, తూర్పు ప్రాంతాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. దేశంలో లోటు వర్షపాతం ఉండటంతో



వ్యవసాయ రంగంలో అనిశ్చితి నెలకొంది. గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ సాగు 23 శాతం తగ్గినట్లు కేంద్రం అంచనా వేస్తోంది. వర్షాలు కురవకపోవడంతో వరి, పప్పుధాన్యాలు, సోయాబీన్, పత్తి వంటి పంటలు ఎక్కు వగా నాట్లు వేయలేదు.వర్షాకాలంలో నాలుగు నెలల్లో జూన్, జూలైలలో తక్కువ వర్షపాతమే నమోదవుతుంది. అయితే, ఆ తర్వాత నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఆగష్టు, సెప్టెంబర్‌లలో మెరుగైన వర్షపాతం నమోదు కావొచ్చని ఆస్ట్రేలియాకు చెందిన వాతావరణ సంస్థ బ్యూరో ఆఫ్ మెటియోరాలజీ (బీఓఎం) తెలిపింది. కానీ, జూలైలో నమోదయ్యే వర్షపాతమే దేశంలో భారీ వర్షాలకు కారణమవుతుంది. వర్షాల లోటును తీరుస్తుంది. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నా.. సాధారణ వర్షపాతమే నమోదవుతోంది.

## గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్‌కు సన్మానం



**జనోదయ : వరంగల్ : జూన్ 30**

వరంగల్ తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్ దయానంద కాలనీలో నూతనంగా వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన మీసాల ప్రకాశ్‌ను ప్రజా సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ దళిత క్రైస్తవ ఐక్యవేదిక – డిసిఐవి వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్, దుగ్గొండి గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల బాబు, గీసుగొండ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగారపు స్వామి, దైవసేవకులు సింగరపు సునీల్, తాటికాయల మనోహర్ తో పాటు పలువురు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

# వానాకాలం సాగుకు భారీ ఊరట

**ఎకరాకు రూ.6,000 రైతు భరోసా విడుదల**

**కోనాయమాకుల రైతు వేదికలో సీఎం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం**



**గీసుగొండ, జూన్ 30 జనోదయ:**

వానాకాలం సాగు పనులు ప్రారంభమవుతున్న వేళ రాష్ట్ర రైతులకు ఆర్థిక అండగా నిలిచే రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.6,000 చొప్పున పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని గీసుగొండ మండలంలోని కోనాయమాకుల రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయగా, రైతులు, అధికారులు కలిసి వీక్షించారు. రైతుల సాగు వ్యయభారాన్ని తగ్గించి, వానాకాలం వ్యవసాయ పనులకు మరింత ఊతమివ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పథకం ప్రాముఖ్యతను వివరించగా, ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా. మజ్జి బాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు, కొమ్మాల పశు వైద్యాధికారి డా. గైని శ్రీనివాస్, హెచ్ఓ బి. మానస, ఎఫ్ఎస్‌సీఎస్ ఊకల్ సొసైటీ చైర్మన్ బి. రమేష్, కోనాయమాకుల సర్పంచ్ వజ్ర రాజు, ఏఈఓలు కావ్య, స్మిత, రాజేష్, ప్రవల్లిక, అఖిల, ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యం-డ్రగ్స్ నిర్మూలనకు

# అవగాహనే మహా ఆయుధం

**బాలా వికాస్--విశ్వ యువక్ కేంద్రం రెండు రోజుల శిక్షణ విజయవంతం..**

**పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్**




**హనుమకొండ, జూన్ 30 జనోదయ:**

మానసిక ఆరోగ్యం పరిరక్షణ, ఒత్తిడి నివారణ, మాదకద్రవ్యాల వ్యసన నిర్మూలనపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో బాలా వికాస్ పీపుల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్, న్యూఢిల్లీకి చెందిన విశ్వ యువక్ కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ పూర్తి చేసిన పాల్గొనేవారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచడం నేటి సమాజానికి అత్యంత అవసరమని అన్నారు. ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి, సమాజ సాధికారత కోసం బాలా వికాస్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ మాట్లాడుతూ, మానసిక ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన మార్గదర్శకత్వం అందించడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం, నిరంతర అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ యంత్రాంగం--స్వచ్ఛంద సంస్థల సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. శిక్షణలో మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించే విధానం, ఒత్తిడిని అధిగమించే ఆచరణాత్మక పద్ధతులు, మాదకద్రవ్యాల వ్యసన నివారణ చర్యలు, సమాజంలో చైతన్యం కల్పించే మార్గాలపై నిపుణులు సమగ్రంగా శిక్షణ అందించారు. మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నిర్మూలనపై గ్రామీణ స్థాయి వరకు చైతన్యం విస్తరించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం పాల్గొన్న వారిలో సేవాభావాన్ని మరింత పెంపొందించడంతో పాటు, సమాజంలో అవగాహన కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టేందుకు దోహదపడనుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 ...Printed At ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED,H NO 6-1-303, WARD - 29 ASHOKNAGAR, KARIMNAGAR, TELANGANA -505001. Editor : MANASANI KRISHNA REDDY

# తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు



### ప్రధాని మోడీ హామీలన్నీ అబద్ధాలే

### పేదవాడి ఖాతాలో 15 లక్షలు, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏవి?

### బండి సంజయ్, కిషన్ రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చాడు

### కేసీఆర్... కాశీ మజిలీ కథలు మానుకో

### పిల్లలను కూడా కేసీఆర్ తాగుబోతులను చేశాడు

### కేసీఆర్‌ను రైతులు పశుపతిని బంధించినట్లు బంధించారు

### రైతు భరోసా నిధులు విడుదల

### రైతు ఆత్మగౌరవంతో బతికేలా పండుగలా వ్యవసాయం

### శిల్పకళా వేదిక కార్యక్రమంలో సీఎం రేవంత్

**జనోదయ, హైదరాబాద్, జూన్ 30:**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వచ్చే ప్రభుత్వం మాదే అం టున్నాడు.. ఏంది వచ్చేది.. తెలం గాణలో బీజేపీ ఆటలు సాగవు అని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్‌లో రైతు లకు అందించే రైతు భరోసా ఆర్థిక సాయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి హైదరాబాదులోని శిల్పకళ వేదికగా సీఎం విడుదల చేశారు. తొలి రోజు 41.37 లక్షల మం ది రైతుల ఖాతాలోకి రూ. 2,482.02 కోట్లు, ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షలమంది రైతుల కోసం రూ. 878.94 కోట్లు, రెండు ఎక రాల వరకు భూమి కలిగిన 26.72 లక్షల మంది రైతుల కోసం రూ. 1, 603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లా డుతూ..డిసెంబర్ 7, 2023 న ప్రజా పాలన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ 30 నెలల్లో రై తును ఆత్మగౌరవంతో బతికేలా వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దడానికి సంపూర్ణంగా ప్రయత్నం చేస్తున్నాం అని పేర్కొన్నారు.గత ముఖ్యమంత్రులు 60 యేళ్లలో 69 వేల కోట్ల అప్పులు చేస్తే.. కేవలం కల్వకుంట్ల కుటుంబం 7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసి అప్పుల ఊబిలో నిండా ముంచారు అని మండిపడ్డారు. మళ్లీ లేవడానికి వీలులేకుండా అప్పులతో మన్ను కప్పారన్నారు.స్వయం సహాయక మహిళలు బడి పిల్లలకు వండి పెడితే వాళ్లకు కూడా డబ్బులు ఇవ్వలేదు.. హాస్టళ్లలో చదువుకునే పిల్లలకు మైస్ ఛార్జీలు ,కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వ లేదు..అప్పులతో పాటు అడ్డగోలుగా తప్పులు కూడా చేసి ఢిల్లీకి పోయే పరిస్థితి లేకుండా చేశాడు అని కేసీఆర్‌ను విమర్శించారు.30 నెలల్లో సమా జంలో గౌరవం పెంచుకుని , విధ్వంసమైన తెలం గాణను వికాసం వైపు నడిపిస్తున్నాం...ఎప్పుడు ప్రజల్లోనే ఉంటున్నాం.. తప్పించుకుని తిరగడం లేదు.. ఫామ్ హౌస్‌ల్లో ఉండటం లేదు అని స్పష్టం చేశారు.రైతు భరోసాను 12 వేలకు పెంచి ఇప్పటి వరకు 27 వేల కోట్లు రైతు ఖాతాల్లో వేశామని,ఈ విడుతతో కలిపి 36 వేల కోట్లు రైతు భరోసా కింద చెల్లించామన్నారు.ఉచిత కరెంటును కనిపె ట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, ఉచిత కరెంటు మాది అన్న సన్నాసులను ఆడబిడ్డలు చీపురుకట్టలు తిరగేసి కొడతరు అని చురకలు అంటించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఉచిత కరెంటుతో పాటు విద్యుత్ బకా యిలను రద్దు చేస్తు సంతకం పెట్టారని, కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలు అని ఇప్పుడు విమర్శిస్తు న్నారు.నెలకు 1000 కోట్ల రూపాయలను ఉచిత కరెంటు కోసం ఖర్చు చేస్తున్నాం.. ఇప్పటి వరకు 30 వేల కోట్లు ఖర్చు చేశాం అని వివరించారు. రైతుల కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేద్దాం..చర్చకు సిద్ధమా..పదేళ్లలో మీరు ఏం చేశారో, రెండున్నర యేళ్లలో మేం ఏం చేశా మో చర్చించుకుందాం రండి అని సవాల్ విసిరా రు.కాళేశ్వరం కోసం లక్షా రెండు వేల కోట్లు చెల్లిస్తే రెండేళ్లలో కూలిపోయి కూలేశ్వరం అయింది.. డబ్బులు గోదావరిలో కలిసిపోయాయి..ఏ ఊరిలో రైతులు పంటలు పండించినా కాళేశ్వరం నీళ్లతోనే పండాయి అన్నారు..మూడేళ్లలో కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా 2 కోట్ల 80 లక్షల టన్ను ల ధాన్యాన్ని తెలంగాణ రైతుల పండించారు అని గుర్తు చేశారు.కేసీఆర్..ఎంత కాలం కాశీ మజలీ కథలు చెపుతావు..నీ కథలు విన్న తర్వాతనే తెలం గాణ ప్రజలు ఫామ్ హస్‌లో పెట్టారని ఎద్దేవా చేశారు.చిన్న రాక్షసులు బయలుదేరి కేసీఆర్ రావా లని కోరుకుంటున్నారని చెపుతున్నాడు.. కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకోవటం లేదని స్పష్టం చేశారు.అన్ని కల్చర్లను సర్వనాశనం చేసి తాగుడు కల్చర్ పెట్టాడు..మేం రైతు బజార్లు తెస్తే కేసీఆర్ బెల్ట్ బజార్లు తెచ్చాడు.. పిల్లలను కూడా కేసీఆర్ తాగుబోతులను చేశాడు అని ఆగ్రహించారు.ప్రతి పేదవాడి ఖాతాల్లో 15 లక్షలు వేస్తానని మోదీ చెప్పాడు.. యేడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తాన న్నాడు.. 24 కోట్ల ఉద్యోగాలు రావాలి ..వచ్చా యా..? తెలంగాణలో బండి సంజయ్, కిషన్ రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చాడు అని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు.దమ్ముంటే రాజీనామా చేయాలని అంటున్నారు...నీ అయ్య జాగీరా, నీ తాత గడీలు అనుకుంటున్నవా, గడీల ముందు బానిసలమా రాజీనామా చేయడానికి అని ధ్వజ మెత్తారు.కేసీఆర్ మళ్లీ వస్తే భార్య భర్తల ఫోన్లు వింటాడు తప్ప ఏమీ చేయడు.. పెళ్లాం మొగుడు మాట్లాడుకున్న మాటలు వినడానికి సిగ్గుండాలి.. సొంత బిడ్డ కూడా నేను, నా భర్త మాట్లాడుకున్న మాటలు విన్నారని చెప్పింది.. ఇంకా ఎందుకు ఆ బతుకు అని చీదరించారు.





**నేను ఉన్నది ఉన్నట్లు చెపుతా.. చేసేది చెపుతా..**

కిరీటాలు పెట్టుకోవాలి, వజ్ర వైడూర్యాలు సంపాదించాలని నాకు లేదు.. పదవి శాశ్వతం కాదని,మాట శాశ్వతమని, మాట కోసం ఎంతకైనా నిలబడతాడు అన్న పేరు కోసం ప్రయత్నం చేస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా కూటమి పాలన

### అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

**జనోదయ : డి.హీరేహాళ్ జూన్ 30**

రాష్ట్రంలో సుభిక్ష పాలన అందించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రము అన్ని విధా లుగా అభివృద్ధి చెందాలన్న ధ్యేయంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వ ర్యంలో కూటమి పాలన కొనసాగుతు న్నదని దీనికి అనుగుణంగానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడం ద్వారా ప్రజాభిమానాన్ని పెం పొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. డి హీరేహాల్ మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రానికి రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాయదుర్గం ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ అదనపు నిధులు కేటాయిస్తోందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాల నలో రాయదుర్గం ప్రాంతంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. తెలుగు దేశం పార్టీ వారిపై కక్ష సాధింపు, వ్యక్తి గత దాడులు, బెదిరింపులు, అక్రమ కేసు ల్లాంటి రాజకీయ కుట్రలు మినహా ఈ ప్రాంతానికి వైకాపా చేసింది శూన్యమ న్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభు త్వంతో కొత్త దశ ఆరంభమైందన్నారు. రాయదుర్గం నియోజకవర్గం వెనుక బాటుతనాన్ని ప్రభుత్వ పెద్దలు, మంత్రుల దృష్టికి పదేపదే తీసుకెళ్లడం ద్వారా అదనపు నిధులు మంజూరు చేయించుకో గలుగుతున్నామన్నారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో అదనపు నిధులు రాయదుర్గానికి కేటాయిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ముఖ్య మంత్రి నేమకల్లు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలు దశల వారీగా నెరవేరు తున్నాయన్నారు.డీ హీరేహాల్‌కు అదనపు భవనంతో పాటు 30 పడకల ఆసుపత్రి మంజూరు కోసం కృషి చేస్తున్నామని వెల్ల డించారు. ఇప్పటికే జూనియర్ కళాశాల మంజూరు చేయించామని, దానికి అవ సరమైన భవనాల కోసం కూడా నిధులు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతు న్నాయని తెలిపారు. త్వరలో ఆధునిక వైద్య సేవల కోసం ల్యాబ్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో మిగిలిన పనులను కూడా రాబోయే మూడేళ్లలో పూర్తి చేస్తా మన్నారు. కష్ట కాలంలో పార్టీ కోసం కష్ట పడి పనిచేసిన వారికి తప్పక ప్రాధాన్యత ఉంటుందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పరిపాలనా అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



సమన్వయం, మంత్రి నారా లోకేష్ వేగ వంతమైన చర్యలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయడం వల్ల రాష్ట్రా నికి కలుగుతున్న ప్రయోజనాలు అర్థమ య్యేలా గ్రామాల్లో ప్రజలకు వివ రించాల న్నారు. ప్రజలకు జరుగుతున్న మంచి, అభివృద్ధి పనులను ఇంటింటికీ తీసుకె ళ్లాలని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలో పేతం చేసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చి నా కూటమి పార్టీలు విజయభేరి మోగిం చేలా ప్రజలతో అనుబంధాన్ని మరింత పెంచుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ నాగల్లీ రాజు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంఛార్జి తలారి గంగాధర్, మాజీ మండల కన్వీనర్ మా కాశి వెంకటేశు ఎంపిటిసి మొండి మల్లికార్జున, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ దొడగట్ట రామాంజ నేయులు,వెంకటేశులు, తిప్పేస్వామి, నాగయ్య,వన్నూరుస్వామి పాల్గొన్నారు.